
సాక్షి
గుంటూరు
సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024



దుర్గమ్మ సేవలో ..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సినీనటులు కిరణ్ అబ్బవరం, రక్షిత్‌లు ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయఅధికారులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 519.00 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 821.40 అడుగుల వద్ద ఉంది.



స్మృతివనం.. కోలాహలం

విజయవాడలో ఏర్పాటు చేసిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని వీక్షించేందుకు ప్రజలు తరలివస్తున్నారు. ఆదివారం సందర్శకులతో స్వరాజ్ మైదానం కిక్కిరిసింది.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక ఆసరా

- ద్వాక్రా గ్రూపు సభ్యుల ఆర్థికాభివృద్ధికి 'వైఎస్సార్ ఆసరా' దోహదం
- పక్కాగా అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం
- నాలుగు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- తద్వారా గత ప్రభుత్వంలో తీసుకున్న రుణాలు మాఫీ



మంత్రి విడదల రజని, మేయర్ కావటి మనోహర్ చేతుల మీదుగా వైఎస్సార్ ఆసరా చెక్కు అందుకుంటున్న డ్వాక్రా గ్రూపు సభ్యులు(ఫైల్)

నెహ్రూనగర్: అక్క చెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నిండాలనే ఆకాంక్షతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. అందులో భాగంగా గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిలు తీసుకున్న రుణాలకు సంబంధించిన నగదును వారి ఖాతాల్లో జమచేసి రుణమాఫీ చేస్తామని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అధికారం చేపట్టినప్పటి నుంచి నాలుగు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. అతివల కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా అండగా నిలిచారు.

ఇచ్చిన హామీ మేరకు...

రాష్ట్ర ప్రభుత్వం పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోంది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు వైఎస్సార్ ఆసరా, స్త్రీనిధి, ఉన్నతి తదితర పథకాల ద్వారా మహిళలు సమాజంలో ఉన్నతంగా జీవిస్తున్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక పక్కాగా అమలు చేసి వారు ఆర్థికంగా ఎదిగేందుకు బంగారు బాటలు వేశారు. తద్వారా గత నాలుగున్నరేళ్లలో లక్షలాది కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి సాధించాయి.

చంద్రబాబు హయాంలో దగా..

డ్వాక్రా గ్రూపు మహిళల రుణాలను మాఫీ చేస్తానంటూ 2014 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక ఆ హామీ నెరవేర్చకుండా మహిళలకు మొండి చేయి చూపారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు చంద్రబాబు మాటలు నమ్మి బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించకపోవడంతో డిఫాల్టర్లుగా మిగిలారు. దీంతో డ్వాక్రా గ్రూపు మహిళలకు టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్యాంకుల్లో రుణాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. చంద్రబాబు చేసిన మోసానికి అక్కచెల్లెమ్మలు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్వాక్రా గ్రూపులకు జీవం పోసింది. మళ్లీ ఆర్థికంగా నిలదొక్కుకునేలా బాటలు వేసింది. సకాలంలో రుణాలు చెల్లించిన సంఘాలకు సున్నావడ్డీ పథకం అమలు చేస్తూ భరోసా ఇచ్చింది.

మహిళల బ్యాంకు ఖాతాల్లో జమైన నగదు

జిల్లాలో మొత్తం పొదుపు సంఘాలు :	29,392
మొత్తం సభ్యులు:	2,86,466
మొదటి విడతలో అందజేసిన నగదు	రూ.244.86 కోట్లు
రెండో విడత :	రూ.248.68 కోట్లు
మూడో విడత :	రూ.246.30 కోట్లు
నాలుగో విడత :	రూ.247.22 కోట్లు
మొత్తం :	రూ.987.06 కోట్లు

జగనన్న చెప్పాడంటే.. చేస్తాడంతే..

రాష్ట్ర ప్రజలందరి అభ్యున్నతితోపాటు మహిళల ఆర్థిక సాధికారితే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారికి అన్నివిధాలా అండగా నిలుస్తున్నారు. ప్రజాసంకల్ప యాత్ర సమయంలో 2019 ఏప్రిల్ నాటికి డ్వాక్రా గ్రూపు మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని అప్పట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నెరవేరుస్తూ 'వైఎస్సార్ ఆసరా' పథకం ద్వారా డ్వాక్రా గ్రూపు మహిళలకు నాలుగు విడతల్లో జిల్లా వ్యాప్తంగా రూ.987.06కోట్లు మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

రూ.2లక్షల రుణమాఫీ జరిగింది..



2019 మార్చి చివర్లో రూ.2లక్షలు డ్వాక్రా రుణం తీసుకున్నాం. ఆ తరువాత ఎన్నికలు జరగడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం విడతల వారిగా మేము తీసుకున్న రూ.2లక్షలు మాఫీ చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా రుణపడి ఉంటాం.
– చైతన్య మహిళ పొదుపు సంఘం సభ్యులు, గుంటూరు

ఆర్థికంగా నిలదొక్కుకున్నాం..



డ్వాక్రా రుణం మాఫీ చేస్తామని ఎంతోమంది హామీలు ఇచ్చారు. కానీ ఇచ్చినమాట ప్రకారం డ్వాక్రా రుణ మాఫీ చేస్తానని చెప్పి రుణమాఫీ చేసి చూపిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్. మేం తీసుకున్న రూ.2.80లక్షలు మా గ్రూపు సభ్యులకు నాలుగు విడతల్లో మా బ్యాంకు ఖాతాల్లో నగదు జమైంది. తద్వారా మేమంతా ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. – శ్రీ వెంకటేశ్వర మహిళ పొదుపు సంఘం సభ్యులు, కొరిటెపాడు

పేద కుటుంబాల్లో వెలుగులు

రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను మాఫీచేసి పేద మహిళల కుటుంబాల్లో వెలుగులు నింపింది. 2014కు ముందు బ్యాంకుల్లో తీసుకున్న డ్వాక్రా రుణాలకు సంబంధించిన నగదును జిల్లావ్యాప్తంగా నాలుగు విడతల్లో రూ.987.06 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది.
– వై.హరిహరనాథ్, డీఆర్‌డీఏ, పీడీ

బోధనకు టీచ్ టూల్

- విద్యార్థి సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ఉపాధ్యాయులకు శిక్షణ
- రేపటి నుంచి ఈనెల 15వ తేదీ వరకు నిర్వహణ
- గుంటూరు, తెనాలిలో రెండు శిబిరాలు ఏర్పాటు
- జిల్లా వ్యాప్తంగా 269 మంది ఉపాధ్యాయులు ఎంపిక



ప్రభుత్వ పాఠ్యాంశాలను బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

గుంటూరుఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'టీచ్ టూల్ ట్రైనింగ్' ప్రోగ్రాం గుంటూరు జిల్లాలో మంగళవారం నుంచి ఈనెల 15 వరకు జరగనుంది. వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన 269 మంది ఉపాధ్యాయులకు ప్రత్తిపాడు మండలంలోని డైట్ కళాశాలతోపాటు తెనాలిలోని మున్సిపల్ హైస్కూల్లో శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేశారు. తరగతిగదిలో విద్యార్థులను ఆకట్టుకునే విధంగా విద్యాబోధన సాగించడంతో అవసరమైన మెళకువలను అలవర్చడంతో పాటు ఉపాధ్యాయుల్లో బోధన సామర్థ్యాన్ని పెంపొందించడం ఇందులోని ప్రధాన ఉద్దేశం. వివిధ సబ్జెక్టుల బోధనలో తరగతిగదిలో ఉపాధ్యాయులు వెచ్చిస్తున్న సమయంలో విద్యార్థులు ఎంత వరకు ఆయా అంశాలను సద్వినియోగం చేసుకుంటున్నదీ అనే అంశాలను శిక్షణలో పరిగణిలోకి తీసుకోనున్నారు.

తరగతి గదిలో ఉపాధ్యాయులు కేటాయిస్తున్న సమయంలో ప్రతి నిమిషం విద్యార్థుల విద్యాభివృద్ధికే వినియోగించాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో బోధనను మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టులో భాగంగా టీచ్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల ఆరో తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరానికి జిల్లాలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులు హాజరు కావాలని సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో తుళ్లూరులోని నేషనల్ అకాడమీ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్స్‌లో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, సూయింగ్ మిషన్ ఆపరేటర్ (టైలరింగ్) కోర్సుల్లో టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు రెండు నెలలపాటు ఉచిత నైపుణ్య శిక్షణ కల్పించి, స్థానిక, వివిధ రాష్ట్రాల్లోని పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. విద్యార్హతల ఆధారంగా ఆయా కోర్సులకు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు తమ ప్రతినిధులు వెంకట్ (95057 19172), జ్యోతిర్మయి (98482 55009)ను సంప్రదించాలని సూచించారు.

98.19 శాతం పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ నాలుగో రోజైన ఆదివారం గుంటూరు జిల్లాలో సజావుగా సాగింది. లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి వలంటీర్లు పింఛన్ అందజేశారు. మూడో రోజు జిల్లా వ్యాప్తంగా 98.19 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లావ్యాప్తంగా 2,62,517 మంది లబ్ధిదారులు ఉండగా వీరి కోసం ప్రభుత్వం రూ.77.50 కోట్లు విడుదల చేసింది. ఆదివారం సాయంత్రం నాటికి 2,57,498 మంది లబ్ధిదారులకు మందికి రూ.76 కోట్లు పంపిణీ చేశారు. నేటి సాయంత్రంతో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ముగియనుంది.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. తెల్లవారు జాము నుంచే ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, యాగశాలలో నిర్వహించిన చండీహోమం, శాంతి కల్యాణంతో పాటు సూర్యోపాసన సేవలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఉదయం నుంచే క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మహా మండపం వైపు నుంచి వచ్చే భక్తుల క్యూలైన్ ఆరో అంతస్తు వరకు , ఇటు ఘాట్‌రోడ్డు వైపువచ్చే భక్తుల క్యూ సమాచార కేంద్రం వరకు చేరింది. మహా నివేదన అనంతరం క్యూలైన్లు త్వరత్వరగా నడిచేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత రూ. 500 అంతరాలయ దర్శనం క్యూలైన్ కాసింత రద్దీ తగ్గడంతో రూ. 300 టికెటు తీసుకున్న భక్తులకు బంగారు వాకిలి దర్శనం కల్పించారు. దీంతో క్యూలైన్‌లో భక్తుల తాకిడి తగ్గింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు పాల్గొన్నారు.

13 నుంచి సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ ఇన్‌చార్జి, అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్ బాబు ఆదివారం ఆవిష్కరించారు.

ముగిసిన త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు

విజయాడ కల్చరల్: స్థానిక దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో వారం రోజులుగా జరుగుతున్న శ్రీత్యాగరాజ స్వామి ఆరాధానా సంగీతోత్సవాలు ఆదివారం ముగిశాయి.

మరియమాతను ఆశ్రయిస్తే దీవెనలు



కొండ పైకి వెళ్తున్న మఠకన్యలు, భక్తులు

గుణదల (విజయవాడ తూర్పు): మరియమాతను ఆశ్రయించి భక్తులకు సకల దీవెనలు లభిస్తాయని ఏలూరు మేత్రాసన గురువు ఫాదర్ తోట గాబ్రియేలు అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన ప్రార్థనలకు ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ గాబ్రియేలు మాట్లాడుతూ ఆరోగ్య ప్రదాయినిగా మరియతల్లి భక్తుల నీరాజనాలందుకుంటుందని తెలిపారు. మతాలు వేరైనా మానవులంతా ఒక్కటేనని పేర్కొన్నారు. మరియమాత భక్తులందరినీ తన అక్కున చేర్చుకుంటుందని వివరించారు. గుణదల పుణ్యక్షేత్రానికి మత భేదం లేకుండా సకల జనులు వచ్చి మరియ తల్లి దీవెనలు పొందుతారని చెప్పారు. ఏటా జరిగే మరియమాత ఉత్సవాలకు అనేక ప్రాంతాల నుంచి లక్షలాది మంది యాత్రికులు ఈ పుణ్యక్షేత్రానికి చేరుకుని తమ మొక్కుబడులు చెల్లించుకుంటారని తెలిపారు. ఈ ఏడాది శతజయంతి ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా జరగటం విశేషమన్నారు. మరియమాత ఈ పుణ్యక్షేత్రంలో ఆవిర్భవించి నూరు వసంతాలు పూర్తి చేసుకోవడం ఆనందదాయకమన్నారు. అనంతరం సమష్టి దివ్య బలి పూజ సమర్పించి భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందించారు. అంతకు ముందు మఠకన్యలు, భక్తులు పెద్ద సంఖ్యలో కొండ పైన మేరిమాత స్వరూపం వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి మరియమాతను వేడుకున్నారు. కార్యక్రమంలో మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ మరియన్న, ఫాదర్ జాన్ పీటర్ పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులకు అండగా జగనన్న

- ఏటా రూ.600 కోట్లకు పైగా ఖర్చు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్యాన్సర్‌కు అత్యాధునిక చికిత్స
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా గుంటూరులో ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

గుంటూరు మెడికల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాన్సర్ రోగులకు పూర్తిస్థాయిలో అండదండలు అందిస్తూ వారి జీవితాలను కాపాడుతున్నారని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన ఆర్‌ఎంపీలు, పీఎంపీల ఆధ్వర్యంలో గుంటూరులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి పచ్చజెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో క్యాన్సర్ నివారణ, నియంత్రణ, చికిత్సలపై తమ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి పనిచేస్తున్నట్లు చెప్పారు. క్యాన్సర్‌కు చికిత్స అందించేందుకు ప్రతి మెడికల్ కాలేజీలో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఉన్న క్యాన్సర్ విభాగాలను బలోపేతం చేశామని పేర్కొన్నారు. విజయవాడ, అనంతపురం, కాకినాడ, గుంటూరు బోధనాసుపత్రుల్లో నాలుగు లైనాక్ మెషీన్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఏడు మెడికల్ కాలేజీల్లో క్యాన్సర్ విభాగాల ఆధునికీకరణ, బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి క్యాన్సర్ చికిత్సను ఆరోగ్యశ్రీ కింద చేర్చిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. ఏటా ఏకంగా రూ.600 కోట్లకు పైగా నిధులను క్యాన్సర్ చికిత్స కోసం ఆరోగ్యశ్రీ కింద ఖర్చు చేస్తున్నామన్నారు. ఏకంగా 600కు పైగా క్యాన్సర్ ప్రొసీజర్లకు ఆరోగ్యశ్రీ ద్వారా ఈ రోజు రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా వైద్యం అందుతోందని చెప్పారు. అనంతరం మంత్రి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి

- పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో మౌలిక వసతులు
- జిల్లాలోని 289 ప్రభుత్వ పాఠశాలల్లో పనులు పూర్తి
- నియోజకవర్గానికి ఒక ఎంఈఓ నోడల్ అధికారిగా నియామకం
- తాగునీరు, ఫర్నీచర్, విద్యుత్, టాయిలెట్స్ సదుపాయాలు కల్పన
- స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్, నాడు–నేడు నిధులతో పనులు పూర్తి



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రూమ్‌ల వారీగా వేసిన నంబర్లు

గుంటూరు ఎడ్యుకేషన్ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న పాఠశాలలపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లావ్యాప్తంగా 289 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక మౌలిక వసతుల కల్పన కింద ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో కనీస సదుపాయాలను కల్పిస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో నియోజకవర్గానికి ఒక ఎంఈఓను నోడల్ అధికారిగా నియమించిన సమగ్ర శిక్ష అధికారులు సంబంధిత ఎంఈఓ సారథ్యంలో పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేస్తున్న పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు చేపట్టారు. తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్, ఫర్నీచర్ సదుపాయాలను కల్పించేందుకు స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్, నాడు–నేడు రెండో దశలో విడుదల చేసిన నిధులతో చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు.ఉద్యోగులతోపాటు ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆయా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేసిన 289 పాఠశాలల్లో నాడు–నేడు ద్వారా అభివృద్ధి పరచిన పాఠశాలలు సైతం ఉండటంతో ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులకు ఎటువంటి ఇబ్బందులు లేవని విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు గుర్తించారు. అయినప్పటికీ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన 289 పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించినట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి. విజయలక్ష్మి చెప్పారు.

క్లుప్తంగా

కాపు ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

26 జిల్లాల నుంచి హాజరైన కాపు సంఘం ఉద్యోగులు



నెహ్రూనగర్: తెలగ, బలిజ, కాపు ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల రాష్ట్ర ఆత్మీయ సమావేశం గుంటూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 45 ఉద్యోగ సంఘాల నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు. తెలగ, బలిజ, కాపు జేఏసీ కన్వీనర్ రాము మాట్లాడుతూ కాపు ఉద్యోగుల్లో ఐక్యత కోసం ఈ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాపు ఉద్యోగుల జేఏసీని ఏర్పాటు చేసి పలు తీర్మానాలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా, అసెంబ్లీ స్థాయిలో జేఏసీ కార్యాచరణ సిద్ధం చేయడం, త్వరలో రాష్ట్రస్థాయిలో 10 మంది రిటైర్డ్ ఉద్యోగులు, 10 మంది ప్రొఫెషనల్స్, 10 మంది కాపు నాయకులతో జేఏసీకి సమాంతరంగా పొలిటికల్ కాపు ఉద్యోగుల సహకార సమన్వయ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ముందుగా శ్రీకృష్ణదేవరాయులు పట్టాభిషేకం, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలను విరూపాక్ష పీఠం సుబ్రహ్మణ్యం స్వామీజీ చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామకృష్ణ, పోల్లా నారాయణ, డి శ్రీనివాస్, పి. పోలేశ్వరరావు, జి వేళాంగిణిరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చేబ్రోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మరణించిన సంఘటన ఆదివారం జరిగింది. చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన చల్లపల్లి విజయ్(24) ద్విచక్ర వాహనంపై గుంటూరు నుంచి స్వగ్రామం బయలు దేరాడు. మార్గంమధ్యలో చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద లారీని ఓవర్‌టేక్ చేసి ముందు వెళ్తున్న కారును ఢీకొట్టి రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో వెనుక వస్తున్న లారీ విజయ్ మీదుగా వెళ్లడంతో అక్కడక్కడే మరణించాడు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

టీడీపీ అబద్ధాలు, కుట్రల పార్టీ

శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి



పార్టీలో చేరిన వారితో విప్ అప్పిరెడ్డి, బలసాని కిరణ్ తదితరులు

పట్నంబజారు: అభివృద్ధి, సంక్షేమం కలగలిసిన ప్రజల ప్రభుత్వం తమదైతే..అబద్ధాలు, కుట్రలు, అక్రమ పొత్తులు కలగలిసిన పార్టీ టీడీపీ అని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రత్తిపాడు నియోజకవర్గం పొత్తూరు గ్రామానికి చెందిన స్థానికులు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేశారు. బృందావన్ గార్డెన్స్‌లో విప్ కార్యాలయంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి లాలుపురం రాము నేతృత్వంలో, పొత్తూరు సొసైటీ చైర్మన్ నాగం కాశీవిశ్వనాథం, స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకటరమణ, బ్రహ్మరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విప్ అప్పిరెడ్డి, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజలే స్టార్ క్యాంపైనర్లుగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముందు దుష్ట చతుష్టయం ఆటలు సాగవని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్ని తప్పకుండా తమ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ సీఎం జగనన్నపై అచంచల విశ్వాసంతో పార్టీలో చేరిన పొత్తూరు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనుగుణంగా అనుక్షణం వారికి అండగా నిలుస్తానని, ఎప్పుడు ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే శక్తివంచన లేకుండా దాని పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతామని పేర్కొన్నారు. లాలుపురం రాము మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల సమయంలో పొత్తూరు ప్రజలు తీసుకున్న నిర్ణయం శుభపరిణామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, మిర్చి యార్డు వైస్ చైర్మన్ షేక్ సుభాని, పొత్తూరు నాయకులు గుడికందుల నాగేశ్వరరావు, గుడికందుల కామేశ్వరరావు, మక్కెన వెంకటేశ్వర్లు, సైకం శివన్నారాయణ, చొడవరపు శ్రీనివాసరావు, ప్రసాద్, ఉల్లంఘుల రాఘవులు, కృష్ణ, దేవి, పెద్దిరెడ్డి సా మ్రాజ్యమ్మ, మల్లెల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాసేవకు అంకితమైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్

- వైద్యాన్ని ప్రజల చెంతకు చేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ అంటే ప్రజాసేవకు అంకితమైన రాష్ట్రంగా దేశవ్యాప్తంగా గుర్తింపుకు నోచుకుందని, ఆ దిశగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలపాల్సిన ఆవశ్యకత ఉందని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. కొల్లిపరలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన సముదాయం ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. ఆసుపత్రిని ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆహ్వానం మేరకు డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వైద్యసౌకర్యాలను సమర్థంగా ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. చేపట్టిన కార్యక్రమాల ఫలితం అందరికీ చెందాలన్నదే ఆయన ఆశయమని తెలిపారు. తెనాలితో తనకు ఎంతో అనుబంధం ఉందని, మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణతో తనకు గల సాన్నిహిత్యాన్ని సభాముఖంగా వివరించారు. ప్రస్తుతం కొల్లిపరకు కాకతాళీయంగా వచ్చినా, రాజకీయంగా తనకు ఈ గ్రామంతో సాన్నిహిత్యం ఉందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈ గ్రామం వెన్నెముకగా చెప్పారు. భవిష్యత్‌లోనూ ఈ సాన్నిహిత్యం కొనసాగుతుందని కోరుకుంటున్నట్టు వివరించారు. తన పెద్ద కుమారుడు ఉమ్మారెడ్డి వెంకటరమణ గుంటూరు పార్లమెంటు స్థానానికి సమన్వయకర్తగా నియమితులైనట్టు గుర్తు చేశారు. తమ కుటుంబంలో తర్వాతి తరానికి అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ ఉమ్మారెడ్డి, తన తండ్రి సత్యనారాయణకు గల సాన్నిహిత్యం గుర్తు చేసుకున్నారు.

రంగోత్సవ్ పోటీల్లో 'కొండవీడు' ప్రతిభ

- 9 విభాగాల పోటీల్లో 54 మంది విజేతలు
- గోల్డ్, సిల్వర్, ట్రోఫీ, మెమొంటోలు కైవసం

యడ్లపాడు: సృజనాత్మక.. నైపుణ్య విభాగ జాతీయస్థాయి పోటీల్లో యడ్లపాడు మండల విద్యార్థులు సత్తా చాటారు. కొండవీడు గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు, అదే పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటి పాఠశాలకు మంచి పేరు తెచ్చారు. ముంబైకి చెందిన స్వచ్ఛంద సంస్థ రంగోత్సవ్ పేరిట 8వ తరగతి వరకు విద్యార్థులకు తొలివిధ విభాగాల్లో ఆదివారం పోటీలు నిర్వహించింది. ఆర్ట్ కాంపిటేషన్స్ పేరిట జాతీయస్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో అంగన్‌వాడీ కేంద్రం ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు పాల్గొని మెడల్స్, బహుమతులు సాధించారు. కలరింగ్, కోలేజ్, గ్రీటింగ్ కార్డ్ తయారీ, స్కెచ్చింగ్, హ్యాండ్ రైటింగ్, ట్యాటు డిజైన్స్, చిత్రలేఖనం పోటీల్లో ఒక్కొక్కరు రెండేసి విభాగాల్లో పాల్గొని ప్రతిభా నైపుణ్యాలను చాటారు. దీంతో 36 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, 10 సిల్వర్ మెడల్స్, ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచిన ఇద్దరికీ రెండు ట్రోఫీలు, మరో ఇద్దరికీ కన్సోలేషన్ బహుమతులు దక్కాయి. వీరితో పాటు అంగన్‌వాడీ చిన్నారులు నలుగురికి గోల్డ్ మెడల్స్, ప్రత్యేక బహుమతులు వచ్చాయని పాఠశాల హెచ్‌ఎం గోరంట్ల శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు చక్కగా తర్ఫీదు ఇచ్చి, ప్రోత్సహించిన హెచ్‌ఎం శ్రీనివాసరావు, కొత్త సొలస ఎంపీపీఎస్ పాఠశాల హెచ్‌ఎం షేక్ జున్నుసాహెబ్, పాఠశాల ఉపధ్యాయిని షేక్ చాందినీ, ఉపాధ్యాయులతోపాటు విజేతలను విద్యార్థుల తల్లిదండ్రులు, ఎంఈఓలు నాగరత్నం, అరుణకుమారి అభినందించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్. కొండయ్య అందించిన వివరాల మేరకు.. వేటపాలేనికి చెందిన పులుగుబాబు (40) మూడవ లైన్‌పై ప్రయాణిస్తున్న గూడ్స్ రైలును గమనించకుండా పట్టాలు దాటుతున్నాడు. ఈ క్రమంలో రైలు బాబును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చరిత్రలో నిలిచిపోనున్న జగన్ పరిపాలన

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- నంబూరులో నిర్వహించిన జగన్నామ సంక్షేమ సంగమం కార్యక్రమానికి స్పందన
- 1413 మందికి వైద్య పరీక్షలు

పెదకాకాని: ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిన ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పాలన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. ప్రజల కలలను, ఆశలను, తన ఆశయాలుగా స్వీకరించి రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమమైన మేనిఫెస్టో రూపొందించడమే కాకుండా నూటికి నూరు శాతం చేయడం ప్రశంసనీయమని తెలిపారు. మండలంలోని నంబూరులో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కులమతాలు, పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన నేత్రజ్యోతి కంటి పరీక్షలు, గుండె పరీక్షలు, ఫిజియోథెరపీ సేవల్ని 1,413 మంది వినియోగించుకున్నారు. డాక్టర్లు వైద్య పరీక్షల నిర్వహించి వీరిలో 45 మందికి యాంజియోగ్రామ్ సూచించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ జగనన్న పేదల ఇంటి ముందుకే సంక్షేమ ఫలాల్ని అందిస్తున్నారన్నారు. ఇది ఒక పవిత్రమైన కార్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో దాన్ని ఆదర్శంగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంకితభావంతో ప్రజాసేవను కొనసాగిస్తున్నామని తెలిపారు. గత సంవత్సర కాలంగా బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో కంటి సమస్యల నివారణకై నేత్రజ్యోతి ద్వారా ఉచిత వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఏడు పనిదినాల్లో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మీ గుండె పదిలం కార్యక్రమం ద్వారా ఉచిత గుండె పరీక్షలు, అవసరమైన వారికి యాంజియోగ్రామ్ నిర్వహించి సమస్య ఉన్న వారికి స్టంట్స్, బైపాస్ సర్జరీలు చేయిస్తున్నట్లు వివరించారు. దివ్యాంగదర్శిని కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, జైపూర్ కాళ్లు, వెస్ట్రన్ కమోడ్‌లు అందించినట్లు మురళీకృష్ణ తెలిపారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులను వైద్య శిబిరానికి ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించి అదే వాహనంలో ఇంటికి తీసుకు వెళ్లడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు కొనసాగనున్న జగన్నామ సంక్షేమ సంగమ శిబిరం

నంబూరు గ్రామంలో ఆదివారం జరిగిన జగన్నామ సంక్షేమ సంగమ వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పెద్దఎత్తున ప్రజలు తరలి రావడంతో అందరికీ వైద్య సేవలు అందించాలనే ఆశయంతో శిబిరాన్ని సోమవారం కూడా కొనసాగిస్తున్నట్లు మురళీకృష్ణ తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



శిబిరంలో వైద్య పరీక్షలకు హాజరైన వారితో అంబటి మురళీకృష్ణ

ఏపీ నర్సింగ్ విద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగాలు

గుంటూరు మెడికల్: ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ స్టేట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో 'నర్సింగ్ విత్ అవుట్ బోర్డర్స్, ఎక్స్‌ప్లోరింగ్ గ్లోబల్ అపర్చ్యునిటీస్' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ డాక్టర్ వి. వినోద్ కుమార్ మాట్లాడుతూ జర్మనీ, జపాన్ దేశాలతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. తద్వారా ఏపీ నుంచి నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారు ఆయా దేశాల్లో నర్సులుగా మంచి ఉద్యోగం పొందవచ్చని సూచించారు. విదేశాల్లో ఉద్యోగం కోసం వెళ్లాలనుకునేవారికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆర్థిక సాయం చేస్తుందని తెలిపారు. ఏపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 55 నర్సింగ్ కాలేజీలను ఎంపిక చేసుకుని, విదేశాల్లో ఉద్యోగం చేసేందుకు కావాల్సిన శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఎంత మందిని అయినా పంపిస్తామని, నెలకు వేతనం రెండున్నర లక్షలు ఉంటుందని వెల్లడించారు. ఇండియన్ రిసక్షన్ కౌన్సిల్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సి. చక్రరావు మాట్లాడుతూ బీఎస్సీ, జీఎన్‌ఎమ్ నర్సింగ్ విద్యార్థులకు లైఫ్ సేవింగ్ కోర్సులో భాగమైన సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. నర్సింగ్ సిబ్బంది దీనిని సద్వినియోగం చేసుకుని ప్రాణాలు కాపాడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ తప్పనిసరిగా నేర్చుకోవాలని తెలిపారు. అమెరికా టెక్సాస్ టెక్ హెల్త్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ శర్మ మాట్లాడుతూ డయాలసిస్‌లో నర్సుల పాత్ర చాలా కీలకమని చెప్పారు. ఏపీ నర్సింగ్ డెప్యూటీ డైరెక్టర్ బి.వల్లీ, అసోసియేషన్ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ అజినాస్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులకు మన దేశంలో, విదేశాల్లో సైతం ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఎయిమ్స్ పాట్నా ప్రిన్సిపాల్ డాక్టర్ రతీష్‌నాయర్ విదేశాల్లో నర్సింగ్ అభ్యసించిన వారికి ఉన్న ఉపాధి, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ టీటీకె రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ ప్రొఫెసర్ కె.సుశీల, ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సీఆర్ సంషీర్ బేగం, పలు నర్సింగ్ కాలేజీల విద్యార్థులు, యూనియన్ సభ్యులు హాజరయ్యారు. సదస్సు అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని అలరించాయి.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్, నర్సింగ్ యూనియన్ నాయకులు

ఆక్వా డెవిల్స్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా ఈత పోటీలు

తాడేపల్లి రూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఉన్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 24వ కృష్ణానది క్రాస్ ఈత పోటీల్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ లైఫ్‌చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు, దివిస్ లేబరేటరీ లిమిటెడ్ మాజీ డైరెక్టర్ దివి మధుసూదనరావు, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.ఎస్.కె. ప్రసాద్, లైలా గ్రూప్ కంపెనీస్ డైరెక్టర్ గోకరాజు ఆదిత్యవర్మలు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. విజయవాడ దుర్గా ఘాట్ నుంచి ఈత పోటీల్ని ప్రారంభించారు. గోకరాజు గంగరాజు మాట్లాడుతూ పోటలను ఆరు కేటగిరీలుగా విభజంచి పురుషులకు, మహిళలకు విడివిడిగా నిర్వహించామని తెలిపారు. మహిళలు కూడా పురుషులతో సమానంగా పోటీ పడ్డారన్నారు. ఆరు కేటగిరీల్లో మొత్తం 66 మంది మహిళలు, 367మంది పురుషులు కలిపి 433 మంది పాల్గొన్నారని వివరించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి వచ్చారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ సర్వీస్ అండ్ ఫైర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 50 మందిని రెస్క్యూ టీమ్ కింద పంపారని చెప్పారు. 25వ కృష్ణానది క్రాస్ ఈత పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం సమ్మర్ కోచింగ్ క్యాంపును పిల్లలకు ఉచితంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ, కార్యదర్శి ఎం.ఎల్. నరసరాజు, కన్వీనర్ అమ్మిరెడ్డి రామిరెడ్డి, కమిటీ, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో అసోసియేషన్ నిర్వాహకులు

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



పోస్ట్ ఆపరేటివ్ వార్డును ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఆధునికీకరించిన పోస్ట్ ఆపరేటివ్ వార్డును ఆదివారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ వైద్య రంగంలో మునుపెన్నడూ లేని విధంగా అనేక మార్పులు వచ్చాయన్నారు. గతంలో ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లాలంటే వైద్యులు, మందులు సక్రమంగా ఉండవని ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఉండేదని పేర్కొన్నారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వైద్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ప్రధానంగా మండలాల్లో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోనే పరిమితం కాకుండా ప్రతి గ్రామానికి వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను ఏర్పాటు చేశారని చెప్పారు. అంతేకాక ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్షతో ఏ రకమైన రుగ్మతతో బాధపడే వారికైనా అవసరమైన చికిత్స అందించి వారికి మందులు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఒకప్పుడు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో వైద్యులు పూర్తిస్థాయిలో లేక రోగులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులకు స్వస్తి చెప్పి వైద్యులతో పాటు వైద్య సిబ్బంది అందర్నీ నియమించినట్లు చెప్పారు. వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నాడు- నేడు పేరుతో వైద్యశాలల రూపురేఖలు మార్చి అవసరమైన భవనాలు నిర్మించడంతో పాటు కావలసిన పరికరాలను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపట్టే వాటికి తోడుగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ దాతల సహకారంతో జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రసవించిన తల్లీబిడ్డల కోసం పోస్ట్ ఆపరేటివ్ వార్డును రూ.4 లక్షలతో ఆధునికీకరించారని తెలిపారు. సేవా భావంతో రామకృష్ణ పనిచేస్తున్నాడని కొనియాడారు. ఈ పోస్ట్ ఆపరేటివ్ వార్డ్ వైద్యశాలలో ప్రసవించిన తల్లీబిడ్డలకు అభయంగా ఉంటుందన్నారు. కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ఏసీల సౌకర్యంతో పోస్ట్ ఆపరేటివ్ వార్డు తీర్చిదిద్దారని అభినందించారు. ఈ సందర్భంగా ప్రసవించిన తల్లీబిడ్డను ఎన్ని రోజులు పోస్ట్ ఆపరేటివ్ వార్డులో ఉంచుతారనే విషయాలపై సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణ్‌రావుతో మాట్లాడారు. కమిటీ సభ్యుడు రామకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ ఎస్.రాజమోహన్‌రెడ్డి, కొవ్వూరి శైలజ, ఆర్ఎంఓ శోభారాణి, గైనకాలజిస్టులు సుజాత, సుమిత్రా, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ ఉన్నారు.

పేదల పక్షపాతి వంగవీటి రంగా : మోపిదేవి

చెరుకుపల్లి: వంగవీటి మోహన్ రంగా పేదల పక్షపాతి అని, పేద ప్రజలకోసం జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు కొనియాడారు. మండల కేంద్రం కొత్తపేట సమీపంలోని జాతీయ రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన వీఎం రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆదివారం ఎంపీ మోపిదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా మండలంలోని పలువురు నాయకులతో కలసి వంగవీటి మెహన్‌రంగా విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ కార్మిక నాయకుడిగా, శాసన సభ్యుడిగా, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వీఎం రంగా తన జీవితాన్ని త్యాగం చేశారని, అటువంటి గొప్ప వ్యక్తి ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ వీఎం రంగా భౌతికంగా మన మధ్య లేనప్పటికీ అన్ని వర్గాల ప్రజల గుండెల్లో ఉన్నారని అన్నారు. రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులను మోపిదేవి, గణేష్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, బండారు రామారావు, నగరం ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, ప్రసాదం వాసుదేవ రావు, నల్లపాటి రామయ్య, రేపల్లె వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు రమాశాంతా దేవి, భానుకోటి, తూము కోటేశ్వరరావు, మొగలిపువ్వు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు కరణం శ్రీనివాసరావు, కొఠారి నాగరాజు, పిరాటి వెంకటబాబు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే నాదెండ్ల మనోహర్ రాజకీయాలు

- నిబద్ధతతో పని చేస్తున్న సలహాదారులు
- రాష్ట్ర దేవదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ ఫైర్



తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులపై జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ లేనిపోని రాద్ధాంతం చేయొద్దని రాష్ట్ర దేవదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ హెచ్చరించారు. కొల్లిపరలో ఆదివారం బ్రాహ్మణ భవన్ ప్రారంభానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణులకు కల్పిస్తున్న రాజకీయ ప్రాధాన్యతను వివరించారు. ప్రస్తుత ప్రభుత్వంలో కేవలం 46 మందే సలహాదారులు ఉండగా, వీరిలో ఆరుగురు బ్రాహ్మణులున్నట్టు చెప్పారు. జనసేన నేత మనోహర్ చేసిన విమర్శలపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, గత టీడీపీ ప్రభుత్వంలో 60-70 మంది సలహాదారులు ఉండేవారని గుర్తు చేశారు. అందులో అమెరికాలో ఉంటున్న పదిమందికి కూర్చోబెట్టి జీతాలిచ్చారని చెబుతూ మనోహర్ అప్పుడేం చేశారని? ప్రశ్నించారు. ప్రజల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం నీతి, నిజాయతీ, నిబద్ధతతో సలహాదారులు నడుచుకుంటున్నారని చెబుతూ తనతో సహా కొందరు వేతనం తీసుకోకుండా పనిచేస్తున్నట్టు వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్పీకర్‌గా చేసినపుడు మనోహర్ శాసనసభ రినోవేషన్ పేరుతో అవినీతికి పాల్పడటం, అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి తెలిసిపోవడంతో కాళ్లు పట్టుకోవటం అన్నీ తమకు తెలుసునని శ్రీకాంత్ తెలిపారు. కమీషన్ల కోసం రాజకీయం చేయటం మినహా మనోహర్ రాజకీయనేత కాదన్నారు మెట్రో రైలు తెనాలికి తీసుకొస్తానని అన్నప్పుడే ఆయన తెలివితేటలు తెలిసిపోయాయని ఎద్దేవా చేశారు.